
# మంచు తుఫాన్

సాగి నరేంద్రరాజు




**నవంబర్ ఒకటి 1986 వ సంవత్సరం వాతావరణ కేంద్రం హెచ్చరిక చేసినట్లుగానే సాయంత్రం నుండి ఈదురుగాలులు మొదలయ్యాయి.** పిఠాపురం టౌన్‌ను మబ్బులు దట్టంగా చుట్టుముట్టాయి. రాత్రి ఒంటి గంటకు పెనుగాలులు మొదలయి ఒక్కసారిగా టపటపమంటూ ఒడగళ్ళ వాన మొదలయింది. ప్రశాంతంగా నిద్రిస్తున్న పిఠాపురం ప్రజలు శత్రువులు చుట్టుముట్టినట్లు ఉలిక్కిపడి లేచారు. చెట్లు పూనకం వచ్చినట్లు అటు ఇటు ఒరిగిపోతూ నాట్యం చేస్తున్నాయి. ఆకాశంలో పెద్ద వెలుగు ఆ వెలుగుతోపాటు పెద్ద శబ్దం ఎక్కడో దూరంలో పిడుగు పడ్డది. క్షణాలలో కుండపోత వర్షం ప్రకృతి విలయతాండవం. ప్రజల గుండెల్లో గుబులు.

ఆ భయానక రాత్రిలో "అత్తయ్యా" అంటూ అరిచినట్లు పిలిచింది ఆ ఇంటి కోడలు లక్ష్మి. అదే సమయంలో అస్వస్థతకు గురై మంచంపై ఉన్న భర్తకు రగ్గు కప్పుతున్న వరహాదేవిగారు ఉలిక్కిపడ్డారు. ఆమె అనుమానం నిజం అయినట్లు నెలలు నిండిన కోడలుకు పురిటి నొప్పులు మొదలు. "అత్తయ్యా" అంటూ మరలా గట్టిగా అరిచింది లక్ష్మి. "వస్తున్నానమ్మా" అంటూ భయంతో ఒణుకుతున్న కాళ్ళను అదుపు చేసుకుంటూ కోడలు పడక గదిలోనికి వెళ్ళారు. మంచం మీద అటు ఇటు మెలితిరిగిపోతూ నొప్పులుతో అల్లాడిపోతున్న కోడలును చూసి క్షణకాలం అచేతనం అయ్యారు. అదే మంచి తరుణం అన్నట్లు కరెంటు కూడా పోయింది. గదంతా చిమ్మ చీకటి. మరోసారి కోడలు ఆక్రందన "భగవంతుడా" అనుకుంటూ వెనక్కి వచ్చి గదిలో సిద్ధంగా ఉంచుకున్న బ్యాటరీ లైటును అలవాటుగా అందుకుని వెలిగించారు. "అత్తయ్యా తట్టుకోలేకపోతున్నాను అత్తయ్యా" అంటూ వలవలా ఏడ్చింది లక్ష్మి. "వస్తున్నా నమ్మా వస్తున్నా" అంటూ "భగవంతుడా ఇప్పుడు ఎవరు దిక్కు, ఈ భయానక


వాతావరణంలో కోడలిని హాస్పిటల్‌కు ఎలా తీసుకెళ్ళగలను. భర్త మంచం దిగలేని పరిస్థితి, కొడుకు ఎక్కడో కాశ్మీర్ సరిహద్దుల్లో సైన్యంలో ఉన్నాడు. డాక్టర్‌కు ముందే చూపించినా ఫర్వాలేదు వారం వరకు పురుడు రాదు అని నమ్మకంగా చెప్పారు. కానీ రోజు తిరగకుం డానే కోడలికి నొప్పులు వస్తున్నాయి."

"కోడలుకు నొప్పులు వస్తున్నాయా" అడిగారు రామచంద్రగారు. "అవునండీ" అంటూ కోడలి దగ్గరకు వెళ్ళారు. అసలే అనా రోగ్యంతో ఉన్న ఆయన ఆ మాటలకు బిర్ర బిగిసిపోయారు.

"లక్ష్మి ఇప్పుడే వస్తానమ్మా ఓర్చుకో కుమారిని పిలుస్తాను" అంటూ టార్చిలైట్ వెలుగును లక్ష్మి మంచం వైపుకు పెట్టి వేగంగా ఇంట్లోంచి బయటకు వచ్చి వర్షంలో తడుస్తూనే ఎదురింటి కుమారి తలుపులు తట్టారు. నిముషం తిరక్కుండానే కుమారి తలుపులు తెరిచింది. వరహాదేవిని చూసి "లక్ష్మికి నొప్పులా" అంటూ తనే ముందు ఆదుర్దాగా అడిగింది. "అవును కుమారి ఈ పరిస్థితిలో" అంటూ కుమారి చేయిని పట్టుకున్నారు ధైర్యం కోసం. "పదండి" వస్తున్నాను అంటూ క్షణంలో ఇంటికి తాళం వేసి "మీరు లక్ష్మి దగ్గర ఉండండి నేను రిక్షా తీసుకు వస్తాను" అంటూ ఆ వర్షాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆ అర్ధరాత్రిలో బయటకు నడిచింది. కుమారి గవర్నమెంటు స్కూల్‌లో టీచర్. ఆమెకు ఇంకా వివాహం అవ్వలేదు. లక్ష్మి, కుమారి ఇద్దరూ మంచి స్నేహితులు. భోరున వర్షం ఉరుములు మెరుపులతో మగవారికి సైతం భయం గొలిపే వాతావరణంలో ధైర్యంగా ముందుకు వెళ్తోంది. పార్క్ సెంటర్‌లో ఎప్పుడూ రిక్షాలు ఉంటాయి. కానీ ఆ సమయంలో ఒక్క రిక్షా కూడా లేదు. పార్క్ సెంటర్‌లో రిక్షాలు లేకపోతే ఇంకెక్కడా దొరకనట్లే. కుమారి గుండె చప్పుడు వేగం అయ్యింది. ఇప్పుడు ఎలా అనుకుంటూ చుట్టూ చూసి ఏదో గుర్తొచ్చినట్లుంది. వెనక్కి తిరిగి వేగంగా నడవసాగింది. వర్షంలో టపటప మంటున్న హవాయి జోడు వీధి చివరన ఉన్న నాగులాపల్లి రెడ్డిగారి ఇంటిదగ్గర ఆగిపో యింది. రెడ్డిగారు పెద్ద వ్యాపారస్థుడు. కానీ రాత్రి అయితే మద్యం తీసుకుంటారని అంద రికీ తెలుసు. చూడ్డానికి మొరటుగా కనిపిస్తారు కానీ మనిషి ఎలాంటివాడో ఎవరికీ తెలి యదు. అయినా తప్పదు అనుకుంటూ గేటు తెరిచి ఇంటి ద్వారం దగ్గర ఆగిపోయింది.

## ఇదెక్కడి గొడవండీ బాబు!

అంటున్నాడు పాపం తమిళ కామెడీ యాక్టర్ వివేక్. హాస్య బ్రహ్మగా పేరొందిన ఈయనగారు మెరిండా ప్రకటనల్లో కనిపించి మెరిండా త్రాగితే ఏమవుతుందో చెప్పాడు. దాంతో జనాలు కూడా 'ఓహో మన వివేక్' అనుకున్నారు. తర్వాత అసలు ఇబ్బంది వచ్చింది. ఓ లాయర్ మెరిండా త్రాగేటప్పుడు సీసాలోంచి బొద్దింక (చచ్చి) వచ్చింది. దాంతో ఆ లాయరుగారు మెరిండా కంపెనీపైనా అది త్రాగమంటూ ప్రకటనల్లో కనిపించిన వివేక్‌పైనా కోర్టులో కేసు పెట్టాడు. నటించేటప్పుడు బానే వుంది కానీ, ఇదెక్కడి గొడవండీ బాబూ అంటూ ఆ నటుడు తల పట్టుకున్నాడట!



వర్షంలో పూర్తిగా తడిసిన శరీరం గజగజ వణు కుతోంది. మనసులో తెలియని అలజడివల్ల మరింత భయం కలుగుతున్నప్పటికీ రెడ్డిగారి ఇంటి తలుపులు గట్టిగానే తట్టింది. ఎవరూ పలకలేదు. మరలా తట్టింది. అలా రెండు నిముషాలు వరకు తడుతూనే ఉంది. నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా రెడ్డి గారు తెల్లని చొక్కా, లుంగీలో నల్లని ఆయన దేహం. కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. ఎదు రుగా ఉన్న కుమారి వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఏం కావాలి?" అన్నారు. ఆయన మాటలు ముద్దగా వినిపించాయి. ఆయన్ను చూసి భయం కలిగినప్పటికీ ధైర్యం తెచ్చుకుని "రామచంద్రంగారి కోడలికి పురిటి నొప్పులు వస్తున్నాయి ఎక్కడా ఒక్క రిక్షా లేదు. మీరు దయుంచి మీ జీపులో హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాలి" అంటూ ఒక్క గుక్కలో చెప్పేసింది.

"ఇప్పుడా? డ్రైవర్ కూడా లేడు" అంటూ కుమారి మొహంలోకి చూసి "సరే పదండి నేను తీసుకు వస్తాను" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

గండం గడిచినట్లే అనుకుంటూ త్వరగా రామచంద్రంగారింటికి వెళ్ళిపోయింది. నొప్పు లతో సతమతమవుతున్న లక్ష్మికి ధైర్యం చెప్పింది. జీప్ రానే వచ్చింది. లక్ష్మిని నెమ్మదిగా తీసుకువెళ్ళి జీప్ ఎక్కించారు. వరహాదేవిగారు భర్తకు చెప్పి తలుపులు బయట నుంచి తాళం వేసి జీపెక్కారు. ఆ వర్షంలో జీప్ నెమ్మదిగా బయలుదేరింది. కారు చీకట్లో జీప్ లైట్లు వెలుగు చాలీచాలనట్లు వెలుగుతున్నాయి. వర్షం తీవ్రత క్షణం క్షణం పెరుగుతోంది. అప్పుడప్పుడూ ఆకాశమంతా తళతళమంటూ వెలుగునిస్తున్న మెరుపులు, రుయ్యిమంటూ వీచే పెనుగాలులు. ఆకాశం నుండి మోకుల్లా దూసుకు వస్తున్న వర్షపు చినుకులు. సి.ఎం.సి. హాస్పిటల్ వైపు జీపు వెళ్తోంది. నొప్పులు తట్టుకోలేక గట్టిగా అరవలేక లక్ష్మి విలవిల లాడుతోంది. పెదవులు బిగపెట్టినా కన్నీరు ఆగటం లేదు. ఆ వర్షపు జల్లులో ఆమె కన్నీరు కూడా కలిసిపోతోంది. కోడలి బాధను ఒక ప్రక్క చూస్తూనే హాస్పిటల్ దగ్గరవుతున్నప్పటికీ ఆమె మనసు మాత్రం విపరీతమైన ఆందోళనకు గురవుతోంది. భయంతో ఆమె శరీరం ఒణికిపోతోంది. కారణం ఆ సమయంలో విశాఖ నక్షత్రం నడుస్తోంది. మిలట్రీలో ఉన్న ఆమె కొడుకు నక్షత్రం కూడా విశాఖే. తండ్రి నక్షత్రాన పుడితే తండ్రికి ప్రాణగండం అం టారు. విశాఖ నక్షత్రంలో కోడలికి పురుడు రాకుడదని ఈ గండం గట్టెక్కించమని వరహా దేవిగారు తిరుపతి వెంకన్నని మొక్కుకుంటు న్నారు. "వెంకన్నా నీదే భారం. ఈ గండం గట్టెక్కించు నీ దర్శనం కోసం ఏడు కొండలు నడిచి వస్తాను" అని మొక్కుకున్నారు.

సి.ఎం.సి. హాస్పిటల్ వీధిలోకి జీప్ నెమ్మ దిగా మలుపు తిరుగుతోంది. వీధి మలుపులోనే ఉన్న పెద్ద మర్రిచెట్టు పెద్ద కొమ్మ అప్పటి వరకు పెనుగాలుల తాకిడికి విలవిలలాడి ఇంక తట్టుకోవడం నావల్లకాదన్నట్లు ఒక్కసారిగా పెళ్ళుమని శబ్దం చేసి విరిగిపోయి నేలపై పడబోతోంది. అదే సమయంలో ఆకాశంలో జరజరమంటూ ఏదో ప్రాకినట్లు దానికి తోడు పెద్ద శబ్దం ఆ శబ్దాన్ని వెన్నా డుతూ దూసుకువస్తోంది పిడుగు. ఆ సమ యంలో జీప్ మలుపు తిరిగింది. సి.ఎం.సి. హాస్పిటల్ వీధిలోకి కెవ్వుమని అరిచింది లక్ష్మి, "ఏవండీ" అంటూ భర్తని తలుచుకుంది.

❋ ❋ ❋

చలి మైనస్ 30 డిగ్రీల సెలిసియస్. కాశ్మీర్ బోర్డర్ పర్కియా టాప్ మంచు శిఖరంపై ఉన్న సైనిక శిబిరాలు. క్షణంలో రక్తాన్ని గడ్డకట్టించే చలి. అక్కడ నదీజలాలు కూడా ఆ చలికి తలవంచి మంచుగడ్డగా మారినవేళ నల్లని చుక్కలేని ఆకాశం. తెల్లగా మెరుస్తున్న మంచు నేల. 20 అడుగులు మంచును త్రవ్వితేకాని మట్టినేల కనిపించదు. కొంత దూరంలో పాక్ సైనిక శిబిరాలు. ఇరుదేశాల సైనికుల మధ్య ప్రతిరోజు జరిగే తుపాకీ కాల్పుల యుద్ధఖేళి. ఒకరిపై ఒకరు గుళ్ళవర్షం గుప్పించుకోవటం ఒక అలవాటు. ఆ భయానక వాతావరణం బాగా అలవాటు అయిపోయి స్లీపింగ్ బేగ్ (పొడవాటి ఉన్ని సంచి)లో హాయిగా నిద్రిస్తున్న నేను నా మనసుకు ఏదో తరంగం తాకినట్లు ఉలిక్కిపడి లేవబోయాను. కాని కుదరలేదు. కారణం నేను పడుకున్నది స్లీపింగ్ బేగ్. తల ఒక్కటే బయట ఉంటుంది. మిగతా శరీరం అంతా బేగ్‌లో బంధించినట్లు ఉంటుందేమో లేవలేకపోయాను. నా ఆఫీసు బంకరులో నేను ఒక్కడినే ఉన్నాను. చిక్కటి చీకటిని పారద్రోలుతూ ఎర్రగా మండుతున్న "బుఖారీ" (పెద్దసైజు రాక్షస బొగ్గులతో కాలుతున్న కుంపటి). ఆ భయంకర చలిని బంకరులోనికి రానీయకుండా విశ్వప్రయత్నం చేస్తోంది. టైమ్ చూశాను. రేడియం డైల్ రెండు గంటలు చూపుతోంది. ఆ సమయంలో నా మనసు ఎందుకో ఆందోళన చెందుతోంది. ఒకరకంగా నరకయాతన అనుభవిస్తోంది. ఎందుకో తెలియదు. ఎక్కడో ఏదో జరగకూడనిది జరుగుతున్నట్లు ఎవరో నన్ను తలచినట్లు, పిలిచినట్లు నా శరీరానికి తెలియని బాధ ఏదో నా మనసును ముల్లులా గుచ్చుతున్నట్లు.


పిఠాపురంలో ఉన్న అమ్మ నాన్న భార్య గుర్తుకు వచ్చారు. బహుశా లక్ష్మికి నెలలు నిండాయేమో. అక్కడ అంతా ఎలా ఉన్నారో ఏంటో అసలు కిందటి నెలలోనే సెలవుపై వెళ్ళాలని అనుకున్నాను. కానీ రెండు నెలల నుంచి మంచు ప్రతిరోజు కురుస్తూనే ఉంది. ఒక రోజు కూడా తెరిపి ఇవ్వకుండా మంచు కురుస్తోంది. చుట్టూ ఉన్న మట్టినేలను మంచు ప్రపంచంగా మార్చి వేసింది. దారులు మూసుకుపోయాయి. అటువంటి సమయంలో ఎవ్వరూ సెలవులపై వెళ్ళలేరు. వెళ్ళనివ్వరు.



**త**మిళనాడు ఆది ఆంధ్ర కాంగ్రెసుచే, శ్రీ వై. జయమూర్తి అధ్యక్షతన, రిటైర్డ్ ఇంజనీరు, సంఘసేవకులు శ్రీ బయ్యా రామచంద్రారావుగార్కి 15.6.04న విల్లివాకం (చెన్నై)లో సన్మానం జరిగిన సందర్భంగా, వేదికపై శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, శ్రీ పేరిశెట్ల భాస్కరుడు, శ్రీ జి. ఆనందరావు (ప్రసంగిస్తున్నవారు)లను కూడా చూడవచ్చు.

ఒకవేళ ధైర్యం చేసి బయలుదేరినా 18 కి.మీ. మంచు కొండల్లోంచి నడుచుకుంటూ వెళ్ళాలి. మార్గం మధ్యలోనే ప్రాణం పోతుంది. ఇవన్నీ ఇంట్లోవాళ్ళకు తెలియవు. నేను రాలేదనే అనుకుంటారు. ఫ్. దాహంగా అనిపిస్తే బుఖారీ దగ్గరలో వేడెక్కుతున్న వాటర్ జగ్‌ను అందుకుని వేడినీళ్ళను తాగాను. మనసు పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది. ఆందోళన చెందుతోంది. పుట్టి పెరిగిన తరువాత అటువంటి ఆందోళనకు ఎప్పుడూ గురవ్వలేదు. లక్ష్మి పదేపదే గుర్తుకు వస్తోంది. అసహనంగా అనిపిస్తోంది, ఎందుకిలా అవుతోంది. ఇంటి నుంచి ఎటువంటి లెటరు రాలేదు. ఇక్కడకు లెటర్స్ కూడా 15 రోజులకు ఒకసారి వస్తాయి. ఒక్కొక్కసారి 20 రోజులు పైనే పడుతుంది. ఇక్కడకు ఏదీ తొందరగా రాలేదు. ఒకవేళ వచ్చినా తొందరగా ఇక్కడి నుంచి వెళ్ళలేదు. మనసు పరివిధాలు ఆలోచిస్తూనే ఉంది. నిద్ర పట్టలేదు. అసహనంగా అటూ ఇటూ కదులుతూ తెల్లవార్లూ గడిపేశాను. తెల్లవారింది. 9 గంటలకు తయారయి పక్క గదిలో ఉన్న ఆఫీసుకు వెళ్ళాను. నా దృష్టిని పనిమీద కేంద్రీకరించాను. ఎకౌంట్స్ అన్నీ క్లోజ్ చేసి మిగతా డాక్యుమేంటేషన్‌పై దృష్టి పెట్టాను. బ్రేక్‌ఫాస్ట్ అన్నీ ఆఫీసుకే వస్తాయి. జవాన్లు, కీ పర్సన్స్ అందరూ వస్తున్నారు, వెళ్తున్నారు. ఆ రోజు నేను ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడలేకపోయాను. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే నేను అందరితోను ముక్తసరిగా ముభావంగా ఉండిపోతున్నాను. అందరూ నా పరిస్థితి అర్థం చేసుకున్నారు. కొందరు నా నుండి అసంతృప్తిగా వెళుతున్నారు. సహజంగా నేనంటే అందరి జవాన్లకు, కీ పర్సన్స్‌కు, ఆఫీసర్స్‌కు ఇష్టం. వాళ్ళందరూ నాకూ ఇష్టమే. అందరూ నాకు విపరీతమైన గౌరవం ఇస్తారు. కారణం బహుశా నేను కష్టించి పనిచేస్తాను అని, లేదా నేను అందరితో ప్రవర్తించే తీరు వాళ్ళకు బాగా నచ్చి ఉండొచ్చు. ఇప్పుడు నేను, ఎవ్వరి మనసుల గురించి ఆలోచించే స్థితిలో లేను. అలా రోజులు గడిచిపోతున్నాయి. వారాలు కూడా గడిచిపోయాయి. నా ఆఫీసులో ఇప్పుడు ఎవరూ ఉండటం లేదు. వచ్చినవాళ్ళు పని చూసుకుని వెంటనే వెళ్ళిపోతున్నారు. ఎటువంటి ఇష్టాగోష్టులు జరగటం లేదు. నవ్వటం అంటే ఏమిటో మరిచిపోయాను.

ఆ రోజు నవంబరు 20 వ తారీఖు. అయినా ఇంటి నుండి ఎటువంటి సమాచారం అందలేదు. కిటికీ అద్దంలోంచి బయటకు చూస్తున్నాను. ఏం చూస్తున్నానో ఏం ఆలోచిస్తున్నానో నాకే తెలియదు. ఆకాశం నుండి మంచు క్రమం తప్పకుండా కురుస్తూనే ఉంది. అప్పుడు నాకు ప్రతిక్షణం నా భార్య గుర్తొస్తోంది. ఏమయిందో, ఎలా వుందో, ఏంటో. లెటర్స్ వచ్చి 20 రోజులు అయిపోయింది. నాకు లెటర్



## అంతరిక్షయానం - ప్రైవేటు సంస్థల ప్రవేశం

**జూ**న్ 21 వ తారీఖున కాలిఫోర్నియాలో వున్న మెజావ్ అనే చిన్న ఊరు చరిత్ర సృష్టించింది. 6-30 గం॥లకు వైట్‌నెట్ అనే జెట్ ప్లేన్ తన రెక్కల కింద స్పేస్ షిప్ వన్ అనే ఒక రాకెట్‌ని తీసుకొని ఆ వూరి విమానాశ్రయం నుండి 50,000 అడుగులు ఎత్తు ఆకాశంలోకి ఎగిరి అక్కడ నుండి పైలట్‌తో సహా రాకెట్‌ని అంతరిక్షంలోకి వదిలారు. ఈ ప్రయత్నం విజయవంతం కావడంతో మొట్టమొదటిసారిగా ఒక ప్రైవేటు సంస్థ అంతరిక్షయాన ప్రయోగాల్లో ప్రవేశించినట్లు అయింది. స్కేల్డ్ కాంపోజిట్స్ అనే సంస్థ ఇంజనీరు బర్ట్ రూటన్ అనే ఆయన ఈ రాకెట్‌ని రూపొందించారు. ఈ ప్రాజెక్టుకి అయ్యే ఖర్చంతా మైక్రోసాఫ్ట్ కోఫౌండర్ పాల్ అలెన్ భరించారు. అమెరికాలో అంతరిక్షానికి సంబంధించిన ప్రయోగాలు ఇంతవరకు 'నాసా' తప్ప మరే ఇతర సంస్థలు చెయ్యలేదు.

నాసా ఆధిక్యత తగ్గించి, ప్రైవేట్ సంస్థలకి అంతరిక్ష ప్రయోగాలలో ఎక్కువగా చోటివ్వాలని ఈ మధ్య అమెరికా ప్రెసిడెంట్ జార్జి బుష్ ప్రకటన చేశారు. ఇప్పుడీ ప్రయోగం ప్రెసిడెంట్ చేసిన ప్రకటన నేపథ్యంలో జరగటం అమెరికా కంపెనీలు ఒక విశేషంగా భావిస్తున్నాయి. అప్పుడే అమెరికాలో అనేక కంపెనీలు యాత్రీకులను రోదసీ విహారాలకి తీసుకొని వెళ్ళే సన్నాహాలు ప్రారంభించాయి. దీన్ని సాధించటానికి కంపెనీలకు కావలసింది సాంకేతికత కాదు. ఖర్చు ఎంత అవుతుంది? గవర్నమెంటు అంతరిక్ష ప్రయాణీకుల భద్రతా నిమిత్తమై ప్రకటింపబోయే జాగ్రత్తలు, విధులు, అనివార్యంగా ప్రమాదాలు జరిగితే వారికివ్వవలసిన నష్టపరిహారాలు వగైరా తెలుసుకోవాలి. స్కేల్డ్ కాంపోజిట్స్ కంపెనీ అప్పుడే 6-12 మంది యాత్రీకులకు సరిపడే ప్లేన్ డిజైన్ చెయ్యటంలో నిమగ్నమయి వుంది. తాజా వార్తల ప్రకారం స్పేస్‌షిప్ వన్ ప్రయోగం విజయవంతంగా ముగిసి పైలట్ మైక్ మెల్‌విల్ తన రాకెట్‌లో అనుకున్న ప్రకారం రోదశీ యానం చేసి క్షేమంగా భువికి తిరిగి వచ్చాడు. ఈ చారిత్రాత్మక దృశ్యాన్ని ప్రపంచమంతటా వేలమంది తిలకించి పులకించారు.

**- వి.కె.మోహన్**

వచ్చి నెల దాటిపోతోంది. ఇంతలో గుమ్మం దగ్గర అలికిడి అయినా నా దృష్టి మారలేదు. కిటికీలోంచి బయటకు అయోమయంగా చూస్తున్నాను. నా జబ్బపై ఒక చేయి పడింది. ఉలిక్కిపడి చూశాను. పక్కకు నుంచుని ఉన్నారు కల్నల్ అరవిందర్ సింగ్ ఛెద్దా "ఎలా ఉన్నారు" అంటూ నవ్వారు. నేను కుర్చీలోంచి లేవబోయాను. "ఫర్వాలేదు కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు. "ఫైన్ సార్" అంటు మర్యాదగా సమాధానం ఇచ్చాను. "బట్ యు ఆర్ లుకింగ్ శాడ్" అన్నారు అభిమానంగా చూస్తూ. "చూడు డియర్ మన జీవితాలు మన కుటుంబాలకోసం కాదు, మనదేశం కోసం. మనకోసం దేవుడున్నాడు. అంతా బావుంటారు. మనం బాధపడి చెయ్యగలిగింది కూడా ఏమీ ఉండదు. అనవసరంగా మనసు పాడు చేసుకోవద్దు. బి హేపీ" అన్నారు నా కళ్ళల్లోనికి చూస్తూ.

"రైట్ సార్" అన్నాను. అదే సమయంలో పాక్ శిబిరం నుండి రైఫుల్స్ గర్జించాయి. అది అక్కడ మామూలే. దానికి ధీటుగా భారత సైనికుల జవాబు. గంట వరకు కాల్పులు కొనసాగాయి. తరువాత నిశ్శబ్దం.

'ప్రైవేట్ మెయిల్ వచ్చి ఎన్నిరోజులు అయ్యింది' అడిగారు కల్నల్.

"20 రోజులు అయ్యింది సార్" అన్నాను.

"అయితే ఇవాళ రేపటిలో మెయిల్ వస్తుంది," అంటూ లేచారు. నేను కూడా లేచాను. "డోన్ట్ వర్రీ మీకు శుభవార్త వస్తుంది," అంటూ నవ్వుతూ ఆఫీసు బంకరు నుండి బయటకు వెళ్ళిపోయారు.

తరువాత గంట వరకు ఆఫీసు పనిలో నిమగ్నం అయ్యాను. రిలాక్స్ కోసం బంకరు నుండి బయటకు వచ్చి సెంట్రీ పోస్ట్ దగ్గర అటూ ఇటూ తిరుగుతున్నాను. దూరం నుండి సుబేదార్ యమ్.పి. సింగ్ నన్ను గట్టిగా పిలిచారు మీకు ఉత్తరం వచ్చింది అంటూ ఉత్తరాన్ని గాల్లో ఊపుతూ. ఆయన పక్కన బేస్ నుండి లెటర్సు తీసుకు వస్తున్న మన్‌జీత్ సింగ్ ఉన్నాడు. ముబారక్ హో మీకు ఏదో శుభవార్త అంటూ మరల గట్టిగా అరిచారు. ఆయన కేకలు అందరికీ వినిపించాయి. ఉత్తరాన్ని చూడగానే నాలో ఉన్న ప్రతి అణువు ఉద్వేగానికి గురి అయ్యింది. నాకు తెలియకుండానే నేను ఆయన దగ్గరకు పరిగెత్తాను. ఆయన చేతినుండి ఉత్తరం అందుకున్నాను. ఉత్తరం నాలుగు కొనలుపై పసుపు రాసి ఉంది. నా మనసు సంతోషంతో ఊగిసలాడింది. మిగతా బంకరు నుండి సైనికులు కూడా వచ్చేశారు. నన్ను అందరూ చుట్టుముట్టారు. ఆత్రుతతో ఉత్తరం విప్పి చదివాను. అమ్మ రాశారు. సారాంశం - కోడలు క్షేమం. బాబు పుట్టాడు. స్వాతి నక్షత్రం. అచ్చం మీ నాన్నగారిలా ఉంటాడు. మీ నాన్నగారి కోరిక తీరింది. ఇంట్లో అందరికీ ఆడపిల్లలే అన్న బెంగ పోయింది. అందరూ నిన్ను అడిగినట్లు చెప్పారు. నీ రాకకోసం ఎదురు చూస్తున్నాం. ఇట్లు అమ్మ. భార్య, బాబు క్షేమం అన్న పదాలు నా మనసుకి చెప్పలేనంత సంతోషం కలిగించింది. ఇంచుమించు నేను గాలిలో తేలిపోతున్నట్లు అనుభూతి చెందాను. "బాబా? పాపా?" అడిగారు యమ్.పి. సింగ్ 'బాబు' అన్నాను. ఒక్కసారిగా నన్ను కౌగలించుకుని గాలిలోనికి ఎత్తారు. సైనికులందరూ శుభాకాంక్షలు చెప్పారు. ఉరకలు వేస్తున్న సంతోషాన్ని అదుపులో పెట్టుకుని నా ఆఫీసులోనికి వెళ్ళిపోయి, మరో రెండుసార్లు ఉత్తరాన్ని చదివాను. తరుపాత చాలాసేపు మౌనంగా ఉండిపోయాను.

**(మిగాతా వచ్చే సంచికలో)**

# మంచు తుఫాన్

సాగి నరేంద్రరాజు




(గత సంచిక తరువాయి)

నేను తండ్రిని అయ్యాను. ఒక చిత్రమైన అనుభూతి నా మనసుకు ఆనందాన్నిస్తుంది. ఇంతటి సంతోషం జీవితంలో ఎప్పుడూ కలగలేదు. వైర్‌లెస్ సెట్ మోగింది. దూరంలో ఉన్న జవాన్లు సెట్‌లోంచి నాకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇంతలో యమ్.పి.సింగ్‌తో ఉమోద్, దయాళ్ సవాయి, అల్దాన్ సింగ్ వచ్చేశారు. వెనుక కుక్ లియకత్ పెద్ద ట్రేతో స్వీట్స్ తెచ్చాడు. అందరం ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకున్నాం.

"మీ సంప్రదాయం చాలా బావుంటుంది. లెటర్‌కు పసుపు రాసి పంపించటం" నేను నా జీవితంలో మొదటిసారి చూస్తున్నాను అన్నారు యమ్.పి.సింగ్ టేబుల్‌పై ఉన్న ఉత్తరాన్ని ఒకసారి చేత్తో తడిమి. సమాధానంగా నేను నవ్వి ఊరుకున్నాను. "అబ్బ ఎంతకాలానికి నవ్వారు మీరు" అన్నారు సవాయి సింగ్. "పార్టీ మాట ఏంటి?" ఉమోద్ సింగ్ ప్రశ్న. "మీ ఇష్టం" అని "స్కాచ్ ఉందా" అడిగాను. "స్టోర్ ఇన్‌చార్జ్ దయాళ్ సింగ్ ఒక్కటే ఉందని" అన్నాడు. "సరి" అని "ఇక్కడకు పంపండి. ఇవాళ అందరికీ మంచి విస్కీ పార్టీ అని చెప్పండి. లియకత్ ఈ రోజు నాన్‌వెజ్ స్పెషల్‌గా వండాలి" అన్నాను. లియకత్ ఉషారుగా నవ్వుతూ "చూస్కోండి బ్రహ్మాండంగా చేస్తాను" అన్నాడు.

చీకటి పడింది. అన్ని బంకర్లలోను పార్టీ మొదలు అయ్యింది. నా బంకరులో కూడా మొదలు అయ్యింది. నాతో పాటు ఏడుగురం ఉన్నాం. టేప్ రికార్డ్ లోంచి పంకజ్ ఉదాస్ పాటలు నెమ్మదిగా వినిపిస్తున్నాయి. ఉమోద్, అమర్, అల్దాన్, ప్రీతమ్, తోమార్ నేను బుఖారీ చుట్టూ కూర్చున్నాం. డ్రింక్స్ తీసుకుంటూ పిచ్చాపాటీతో పార్టీ కొనసాగుతోంది. "మీ సౌత్ ఇండియన్స్ సాంప్రదాయాలు చాలా బావుంటాయి. లెటర్ చుట్టూ పసుపు రాసి పంపడం నేనెక్కడా చూడలేదు. నాకు చాలా నచ్చింది" అన్నాడు యమ్.పి. సింగ్ రెండవసారి. నేను నవ్వి ఊరుకున్నాను. రుచికరమైన స్నాక్స్‌తో పార్టీని అందరం బాగా ఎంజాయ్ చేస్తున్న సమయం.

ఇంతలో 'గూ' అంటూ చిన్న శబ్దం నా చెవులకు తాకినట్లయింది. ఏదో శబ్దం వస్తున్నట్లుందేమిటి అనుకున్నారు. అయినా అందరితో మాటల్లో పడిపోయాను. కానీ అదే శబ్దం వినిపిస్తూనే ఉంది. క్రమేపీ అది పెద్దది అవుతోంది. నేను విన్నది నిజమే అనుకుని యమ్.పి.సింగ్‌తో అన్నాను. ఆయన కూడా జాగ్రత్తగా విన్నారు. 'అవును నిజమే' అన్నారు. శబ్దం పెద్దది అయ్యింది. ఒక యుద్ధవిమానం దగ్గరలోనే ఎగురుతున్నట్లు. అందరం అప్రమత్తం అయ్యాం.ఒకరి కళ్ళు ఒకరిని ప్రశ్నించుకున్నాయి. "ఏంటా శబ్దం అన్నట్లు." "శత్రువులు దాడి చేస్తున్నారా?" అందరి మదిలో మెదిలిన ప్రశ్న. నేను నా స్టెన్‌గన్‌పై చేయి వేశాను నాకు తెలియకుండానే. మిగతావారు కూడా వాళ్ళ వెపన్స్ అందుకున్నారు. "అల్దాన్ తలుపు తీయి" అన్నాను. అందరం పొజిషన్ తీసుకున్నాం. మా గన్ బేరర్స్ గుమ్మం వైపు గురిపెట్టాం. గదిలో నాలుగు ప్రక్కల నుండి ఎలర్ట్‌గా నుంచున్నాం. "తొందర పడి ఎవ్వరూ ఫైర్ చేయొద్దు. తలుపులు తీసిన వెంటనే బయట నుండి ఎవరైనా ఫైర్ చేస్తే ఆగొద్దు" ఆజ్ఞలు ఇచ్చారు యమ్.పి.సింగ్. 'రైట్ సర్' అన్నాం. అల్దాన్ తలుపు గొళ్ళెంపై నుండి నెమ్మదిగా లేపాడు. గొళ్ళెం పూర్తిగా తప్పుకుంది. అంతే ఒక్కసారిగా అది విసిరికొట్టినట్లు వెనక్కి వచ్చింది.

అంతకంటే ఆశ్చర్యం "షూ" అన్న శబ్దం చేస్తూ మంచు తుఫాన్ వలయం తిరుగుతూ మా గదిలోకి ప్రవేశించింది. "ఎవలాంచ్ (మంచు తుఫాన్)" అని గట్టిగా అరిచారు యమ్.పి.సింగ్. అందరం నిర్ఘాంతపోయి చూస్తున్నాం. ఎప్పుడూ చూడనిది, విననిది కొత్త తుఫాన్. ఎదురుగా ఉన్న మంచు శిఖరంపై నుండి ఒక విచిత్రమైన శబ్దం. టాల్కం పౌడర్ పెద్ద గుట్టచేసి దాని వెనక పెద్ద ఫేన్ పెట్టి అది హై స్పీడ్‌లో తిరిగితే పౌడరు ఎంత భయంకరంగా ఎగురుతుందో అదే విధంగా మంచు భయంకరంగా ఎగురుతూ మా బంకరులోనికి ప్రవేశించింది. విపరీతమైన గాలి మంచు ఏకమై మాపై దాడి. తలుపు తీస్తూనే అల్దాన్ గాలికి వెనక్కి ఎగిరిపడ్డాడు. ఒక్క క్షణంలో గదంతా తుఫాన్ మయం. కళ్ళకు ఏదీ కనపడటం లేదు. 'షూ' అన్న శబ్దం మా చెవులకు మృత్యు సంకేతంలా వినిపిస్తోంది. మంచు తుఫాన్‌కు గదిలో వెలుగుతున్న కారు బేటరీ లైట్ ఎప్పుడో ఆరిపోయింది. గదంతా చిమ్మ చీకటి. పైగా కళ్ళల్లో మంచు చొచ్చుకుపోవటం, మరో పక్క గదిలోకి మంచు ప్రవాహం చొచ్చుకు రావటంతో కొంత సేపు మా మస్తిష్కం పనిచేయలేదు.

కోటు జేబులో ఉన్న స్నో గాగుల్స్‌ను కళ్ళకు తగిలించుకున్నాను. యమ్.పి.సింగ్ కళ్ళను తుడుచుకుంటూ జేబులో ఉన్న బేటరీ లైట్‌ను తీసి వెలిగించారు. ఎలాంటి భయానక పరిస్థితిలోనైనా క్షణంలో అలవాటు చేసుకుని ప్రతిఘటించటం మా అలవాటు. అక్కడున్న అందరం ఎలర్ట్ అయ్యాం. "బేటరీ లైట్ వెలుగుని గుమ్మం వైపు గురిపెట్టి ముందు తలుపులు వేసెయ్యండి" అన్నారు యమ్.పి. సింగ్. అల్దాన్ ఒక్కడే ప్రయత్నించి తలుపు విసిరి కొట్టడంతో పడిపోయాడు. "అలా కాదు అమర్, ప్రీతమ్, తోమర్ నేను తలుపును నెట్టుతా, మీరు అల్దాన్ తలుపు గొళ్ళెం పెట్టండి." అంటూ నలుగురం ఒకరి చేతులు ఒకరు గట్టిగా పట్టుకుని తలుపున్న గోడవైపుకు కదిలాం. తలుపును బలవంతంగా ముందుకు నెట్టి తలుపుకు గాటుకు మధ్యలోనికి వచ్చాను. నాతో మిగతావాళ్ళు కలిసి తలుపును మా శక్తినంతా కూడగట్టుకుని ముందుకు తీసి గుమ్మం దగ్గరకు చేరవేశాం. యమ్.పి. సింగ్, అల్దాన్ సింగ్ చటుక్కున గొళ్ళెం పెట్టారు. గదిలో నిశ్శబ్దం. మంచు రావడం లేదు. 'షూ' అన్న శబ్దం తక్కువగా వినిపిస్తోంది. ఒకసారి గదంతా చూసి బేటరీ లైట్ వైర్‌ని బల్బుకు కలిపాను. గదంతా పూర్తిగా వెలుగునిచ్చింది.

ఒకరినొకరం పూర్తిగా చూసుకున్నాం. అందరి మొహాలపైన మేకప్ వేసుకున్నట్లు మంచు పట్టేసింది. ప్రీతమ్‌సింగ్ తన తలపై ఎప్పుడూ ఉండే పకరి (తలపాగ) ఎగిరి ఎక్కడో పడ్డది. జుట్టంతా విరబోసుకుని ఉన్నట్లు పైగా అతని పొడవాటి జుట్టులోనికి మంచు వెళ్ళిపోయి అతని పొడవాటి గెడ్డంలోకి కూడా మంచు వెళ్ళిపోయి విచిత్రంగా కనిపించాడు ఏదో మంచులో తిరిగే జటాయువులా. అలా అనిపించటంతో పక్కున నవ్వేశాను. మిగతా వాళ్ళు కూడా ప్రీతమ్‌ను చూసి నవ్వడం మొదలుపెట్టారు. "నవ్వకండి ఇప్పుడు మనం చాలా ప్రమాదంలో ఉన్నాం. ఎవలాంచ్ ఇంకా ఉధృతం అయితే మనం ఈ బంకర్‌లోనే సమాధి అయిపోతాం. ఎవలాంచ్‌కు తోడు స్లయిడింగ్ కూడా జరిగితే ఇంక మనల్ని ఆ భగవంతుడు కూడా రక్షించలేడు." అన్నాడు ప్రీతమ్‌సింగ్.

అక్కడ వాతావరణం మరల సీరియస్ అయిపోయింది. 'షూ' అన్న శబ్దం మామూలుగా వినిపిస్తున్నప్పటికీ మరణ సంకేతంలా చెవుల్లో మారుమోగుతోంది. "సర్ ఇక్కడ నుంచి ఎలా బయటపడగలం" అన్నాడు అమర్. "మనం బయటపడలేం. బంకరు బయటకు వెళ్తే ముందే చస్తాం. మనం చాలా ప్రమాదంలో ఉన్నాం" అన్నారు యమ్.పి. సింగ్. అందరి వదనాలు ఆందోళనతో సీరియస్‌గా మారిపోయాయి. మొన్న బీహార్ రెజిమెంట్‌లో కొందరు జవాన్లు ఇలాగే చనిపోయారు. కొందరి శవాలు కూడా దొరకలేదు. దబ్‌మని బంకర్ రూఫ్‌పై బరువైన వస్తువు పడ్డ శబ్దం. దానికి తోడుగా మరికొన్ని మంచు ముక్కలు పడ్డాయి. అందరి గుండెల్లో గుబులు మొదలైంది. ఇంక చావు తప్పదేమో అన్న భావం అందరిలో ఖరారు అయ్యింది. "సర్ మనం చనిపోయిన తరువాతనైనా ఎయర్ లిఫ్ట్ దొరుకుతుందా?" అడిగాడు అమర్.

"కంగారు పడకు, ఇక్కడ ఎన్ని సంవత్సరాలు ఉన్నా మన శవాలు పాడవవు" అన్నారు యమ్.పి.సింగ్ కాస్త చిరాకుతో. "అదికాదు సర్ జనవరి నెలలో మా చిన్న చెల్లెలు పెళ్ళి. దానికోసం ముప్ఫయి వేలు రూపాయలు ఫండ్‌లో లోన్ కూడా తీసుకున్నాను." అంటూ జేబుపై చేయి వేసి తడుముకున్నాడు అమర్. అమర్‌వైపు అందరం బాధగా చూశాం. యమ్.పి.సింగ్‌ని కూడా అతని సమస్య బాధించింది. "అరె" అదా నీ బాధ అంటూ జాలి పడ్డాడు. "నువ్వు ఇప్పుడు చచ్చిపోతే నీ చెల్లెలు పెళ్ళి ఎలా చేసుకోగలదు?" ప్రశ్నించాను నేను. అవును నిజమేకదా అన్నట్లు చూశారు అంతా. అతని సమస్యకు సమాధానం దొరికినట్లు




## స్పృహా

ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకి
లోయను దూకాలి
చీకటి లోయలు దాటితేనే కదా
వెలుగు శిఖరాలు మొలిచేది
నీటి తుప్పల్లో
బంగారం కనిపించేదాకా మునగాలి
శత్రువు చూడట్లేదనే నమ్మకమే
నిన్ను రక్షిస్తుందా?
పిల్లి సామెత గుర్తుకు రాకపోతే
తెలుగు బొత్తిగా చచ్చిపోయినట్టే
ఇంగ్లీషు కలలూ వుంటాయా
సమస్యలు కురిసీ కురిసీ
కలల కాసారాల్లోకి యింకిపోతాయి
స్పృహలో కలలుగనే జీవిత నిస్పృహా
కలలోనూ జీవన స్పృహా
మనసు తేలికయి
సగటు మనిషి గాల్లో తేలుతున్నాడు.
– చిత్తలూరి సత్యనారాయణ

ఫీలయ్యాం. ఒకపక్క 'షూ' అన్న శబ్దం వస్తున్నా మంచు ముక్కలు బంకరుపై పడుతున్నా అందరి మనసులలో వాళ్ళవాళ్ళ కుటుంబాలపై ఆలోచనలే. చావు హఠాత్తుగా వస్తే బహుశా ఏ ఆలోచనలు రావేమో చచ్చిపోతున్నాను అనే బాధ తప్ప. బంకరుపైన మెత్తగా జారుతున్నట్లు మంచు పడుతోంది. కిటికీ అద్దంలోంచి చూస్తే పూర్తిగా మంచుతో కప్పబడినట్లు కనబడుతోంది. ఎవలాంచ్ అలాగే కొంతసేపు కొనసాగితే బంకరు పూర్తిగా మంచుతో కప్పబడి పోతుంది. తరువాత గాలి అందక అందరి ప్రాణాలు పోతాయి. పోయే ముందు ప్రాణాలు గిలగిలమని కొట్టుకుంటాయి. ఒకరి చావును ఒకరు చూస్తూ చచ్చిపోవడం ఒళ్ళు గగుర్పాటుకు గురైంది. శ్వాస తడబడ్డది. అంతకంటే భయానక చావు మరొకటి ఉండదేమో. ఉహూ అటువంటి చావు చావకూడదు. అంతకంటే షూట్ చేసుకుని చచ్చిపోవటం బెటర్.

అందరి మోహాలలోనికి ఒకసారి చూశాను. అమర్‌సింగ్ మొహం కళ తప్పినట్లు అనిపించింది. బంకరులో ప్రాణవాయువు తగ్గినట్లు అనిపించింది. మృత్యు ఘడియలు దగ్గరపడుతున్నాయి. నిర్లిప్తంగా మారింది నా మనసు. నా కళ్ళు నా స్టెన్‌గన్ వైపు మరలాయి. మంచంపై నా గన్ నిశ్శబ్దంగా నన్నే చూస్తున్నట్లు అనిపించింది. ఇప్పటివరకు అది ఎందరి ప్రాణాలు తీసిందో తెలియదు. ఇప్పుడు.. అనుకుంటూ దానివైపు అభిమానంగా చూశాను. చేతికున్న స్నో హేండ్ గ్లౌజ్‌ను తీసి రుమాలుతో స్టెన్‌గన్ పైన అంటిన మంచుని శుభ్రంగా తుడిచాను. ఆప్యాయతతో ఒకసారి దాన్ని తడిమాను. నా చర్యను అందరూ చూస్తున్నారు. నా భావాలు యమ్.పి. సింగ్‌కు అర్థం అయినట్లున్నాయి. నన్ను చూసి చిత్రంగా నవ్వారు. ఆ భయానక వాతావరణాన్ని తేలికపరచాలనుకున్నట్లున్నారు.. ఆయన అందరి మొహాలు ఒకసారి చూసి ""నా మొహంలో ప్రేతకళ వచ్చిందా?" అని అడిగారు చిన్న చిరునవ్వుతో. వెంటనే అందరూ "లేదుసార్" అన్నారు కోరస్‌గా. నాకు మాత్రం ఫక్కున నవ్వొచ్చింది. ఆయనకు ఇలాంటి పరిస్థితిలో ఇలా అడగటం పరిపాటి. ప్రతి ఆపరేషన్ ముందూ ఆయన ఇలాగే అడుగుతారు. 1971 వార్‌కు వెళ్ళబోయే ముందు కుడా ఇలాగే అడిగారట. ఒకడు మాత్రం చిరాకుతో "వచ్చింది" అన్నాడట. వాడి దురదృష్టం కొద్దీ వార్‌లో చచ్చిపోయాడు. అప్పటి నుండి ఎవ్వరూ ప్రేతకళ వచ్చిందని



ఆయనని అనరు. కొందరయితే "ప్రేతకళ లేదుసార్ ఇంకా మీలో పెళ్ళికళ తొంగి చూస్తోంది సార్" అని ఆయన్ని పొగుడుతుంటారు. దానికి ఆయన తెల్లని మీసం దువ్వుకుంటూ ముసిముసిగా నవ్వు కుంటారు.

ఎవలాంచ్ తగ్గినట్లు అనిపించింది. కానీ మృత్యువు పొంచి ఉంది. బంకర్ రూఫ్‌పై మంచు జారుతూ ఉంది. ఆ శబ్దాలు విన్న ప్పుడు అందరి మొహాలు ఆందోళన చెందు తున్నాయి. అక్కడ పరిస్థితి సీరియస్‌గా మారిపోతోంది. ఏడ్చినా ఏడవకపోయినా చావు మాత్రం ఆగదు. అలాంటప్పుడు ఏడుస్తూ చావడం ఎందుకు అనిపించి గదంతా కలయ చూశాను. మూలన దొర్లిపడి ఉంది స్కాచ్ బాటిల్. దాన్ని అందుకుని "ఏలాగూ చావ బోతున్నాం, హేపీగా స్కాచ్ త్రాగుతూ స్నాక్స్ తింటూ చద్దాం" అన్నాను అందరినీ చూస్తూ. యమ్.పి.సింగ్ నవ్వుతూ చూశారు. ఉమోద్, అమర్ మాత్రం చిరాగ్గా చూశారు. అయినా నేను ఆగలేదు. అందరి గ్లాసులు టేబుల్‌పై పెట్టి డ్రింక్ పోశాను. అందరూ గ్లాస్ అందుకున్నారు. హాట్‌బాక్స్ ఓపెన్ చేసి నాకిష్టమైన ఫిష్ ఫ్రై తిన్నాను. అసలు ఈ స్కాచ్ పార్టీ చద్దా సాబ్‌కు ఇద్దామనుకు న్నారు. కానీ ఇది ఆయన బేడ్ లక్ మన గుడ్‌లక్. ఇట్స్ అవర్ లాస్ట్ డెత్ పెగ్ బట్ ఉయ్ హేవ్ టు సెలబ్రేట్ ఇట్ హేపీలీ. యమ్.పి. సింగ్ నవ్వారు. ఆయనతో మిగతావాళ్ళు కూడా శ్రుతి కలిపారు. అమ్మయ్య ఇలాంటి పరిస్థితితో కూడా అందరినీ నవ్వించగలిగాను. ఇది చాలు అనిపించింది.

"ఏ సర్వీసులో లేని ఫెసిలిటీస్ మిలట్రీలోనే ఉన్నాయి. ఎందుకనుకున్నావు ఇలా హేపీగా ఎంజోయ్ చేసి చచ్చిపోమని మనకి గవర్న మెంట్ ఇస్తుంది" అన్నాను. అందరూ నవ్వారు. "ఇంకొక ఫెసిలిటీ గురించి చెప్పనా" అన్నాను అందరికీ డ్రింక్ పోస్తూ. "ఏమిటది" అన్నాడు ఉమోద్. "మనం చనిపోతే మనం భార్యలకు టెలిఫోన్ కనెక్షన్ ఫ్రీగా ఇస్తారట మన టెలికం డిపార్ట్‌మెంట్‌వాళ్ళు" అన్నాను. "అంటే మనం



## ఏమిటి సంగతి!

**కా**జోల్ భర్త అజయ్‌దేవగన్, ఐశ్వర్యారాయ్‌ల గురించే ఇప్పుడు బాలీవుడ్ హాట్‌హాట్‌గా చెప్పుకుం టోంది. పెద్ద పెద్ద విశేషాలేమీ లేకపోయినా, అజయ్ దేవగన్ తన ప్రతి సినిమాలోనూ హీరోయిన్‌గా ఐశ్వ ర్యారాయ్‌నే ఎంపిక చేయమని పట్టుపడుతున్నాడట! ఐశ్వర్యని భరించే శక్తిలేక, తాము అనుకున్న హీరో యిన్‌ని ఎంపిక చేయలేక నిర్మాతలు నానా తిప్పలు పడుతున్నారట. ఖాన్ త్రయం వల్ల తీవ్ర నష్టాల్లో పడి పోయిన ఐశ్వర్యకి చేయూతనివ్వడానికే అజయ్ ఇలా చేస్తున్నాడన్న వాదన ఉన్నా, ఆయనగారికే ఐశ్వర్య పట్ల అంత 'ఇది' ఎందుకన్నది మరికొందరు వాదన! ఏం చేద్దామంటారూ?

బ్రతికి ఉండగా మనకి ఆ అవకాశం ఇవ్వరన్న మాట" అన్నాడు సవాయి సింగ్. "అవును" అన్నాను. అందరూ పకపకా నవ్వారు. ఎంత నవ్వుతున్నప్పటికీ నా మనసు కూడా నా ఇంటి వైపు వెళ్తోంది. బాబు గుర్తొచ్చాడు. పూర్ చాప్. పుట్టాడు తండ్రిని మింగేశాడు అన్న అపవాదు పడిపోతుంది వాడిపై పాపం. అనుకున్నాను. వాడు పుట్టి ఉండకపోతే ఈ పార్టీ లేకపోను. ఇక్కడ నేనొక్కడినే ఈ ఎవలాంచ్‌లో చచ్చేవాడ్ని. అందరి వైపు చూసి "ఒన్, టు, త్రీ, ఫోర్, ఫైవ్ నాతో కలిపి ఏడుగురం" అన్నాను. "ఏదో వందల మీదున్నట్లు ఎందుకీ లెక్క" అన్నాడు తోమర్. "ఆహా మా వైపు ఒక సామెత ఉంది" అన్నాను అందరినీ నవ్వుతూ చూసి. "ఏంటది" అన్నాడు అల్తాన్. "రాచపీనుగ ఒక్కటే వెళ్ళదట అది నిజమే చూడండి. ఈ రోజు నేను నాతో పాటు మిమ్మల్నందర్నీ తీసుకుపోతున్నాను" అంటూ పకపకా నవ్వాను. యమ్.పి.సింగ్ కూడా పైకి నవ్వారు. మిగిలినవారంతా ముభావంగా వుండిపోయారు.

"బయట వాతావరణం నిశ్శబ్దంగా మారినట్లుంది. బయట ఎటువంటి శబ్దం లేదు" అన్నాను. "అవును" అన్నారు యమ్.పి.సింగ్. జాగ్రత్తగా వింటూ కొంతసేపు గడిపాం. ఎటువంటి శబ్దం లేదు. "బహుశా తుఫాన్ ఆగిపోయిందేమో" అన్నారు అమర్, అల్తాన్, దయాళ్ కూడా. నెమ్మదిగా తలుపు తెరిచాం. అందరం ఆశ్చర్యపోయాం. అక్కడ మంచు గోడ కట్టినట్లు అడ్డంగా ఉంది. స్నో షూస్‌తో మంచు గోడను తన్నుకుంటూ బయటకు వచ్చాం. మా పరిసరాలు చూసి మరింత ఆశ్చర్యపోయాం. కారణం మా బంకర్లు అన్నీ మంచుతో నిండిపోయి ఉన్నాయి. మరి కొంత సేపు తుఫాన్ కొనసాగి ఉంటే అంద రం మంచులో కూరుకుపోయి చనిపోయే వాళ్ళం. కేవలం నిముషాల తేడాలో బ్రతికాం.

మరింత ఆశ్చర్యపోయే విషయం ఎదురుగా "పీరు బాబా" గుడి. కొండపై కనిపిస్తోంది. కానీ ఆ గుడి మాత్రం మంచుతో కప్పబడి లేదు. అందరం ఆ "పీరు బాబా" గుడివైపు చూస్తున్నాం. దాని చుట్టూ ఉన్న ఎత్తయిన చెట్లు కూడా మంచులో మునిగి పోయాయి. అద్భుతం. "జై పీర్‌బాబా" అన్నారు యమ్.పి. సింగ్ రెండు చేతులు జోడించి. "నీ కరుణవల్ల మేమంతా బ్రతికాం" అన్నారు. మేమంతా "పీర్‌బాబా" కు నమస్క రించాం. "నిజమే ప్రభూ! ఇప్పటివరకూ నీ మహత్తు విన్నాను ఇప్పుడు కళ్ళారా చూస్తు న్నాను" అని భక్తిశ్రద్ధలతో నమస్కరించాను.

✵